రోడ్లపై నిలిచిపోయిన వరద నీరు


చత్రినాక చౌరస్తాలో వరద నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో గురువారం కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఈదురుగాలులతో ప్రారంభమైన వర్షం గంటన్నర పాటు ఏకధాటిగా కురవడంతో భారీగా వరద నీరు రోడ్లపై నిలిచిపోయింది. బండ్లగూడ చౌరస్తా, చాంద్రాయణగుట్ట, ఛత్రినాక, ఉప్పుగూడ, పూల్‌బాగ్‌లలో ఈ వర్షపు నీటిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మండుతున్న ఎండలతో అల్లాడిన జనం ఈ వర్షంతో ఉపశమనం పొందారు. రోడ్లపై నిలిచిన నీటిని జీహెచ్‌ఎంసీ సిబ్బంది మ్యాన్‌హోళ్ల పైకప్పులు తీసి వెళ్లేలా చర్యలు చేపట్టారు.

కోటకు విదేశీ కళ



గోల్కొండ: గోల్కొండ కోటకు పెద్ద సంఖ్యలో విదేశీ పర్యాటకులు వస్తున్నారు. గత రెండు రోజుల నుంచి కోటలో విదేశీ పర్యాటకులు వరుస కట్టి వస్తున్నారు. యూరప్ దేశాల నుంచే కాకుండా లాటిన్ అమెరికా దేశాల నుంచి కూడా పర్యాటకులు కోటకు వస్తున్నారు. కోటలో ఆయుధాగారంతో పాటు నేటికీ పటిష్టంగా ఉన్న సైనికుల గదులను చూసి పర్యాటకులు నోరెళ్లబెడుతున్నారు. నగీనాబాగ్ నుంచి రాణిమహల్ వెళ్లే మార్గంలో ఉన్న ఎత్తైన, వెడల్పు అయిన గోడలను తమ సెల్‌ఫోన్‌లు, కెమెరాలలో బంధించుకుంటున్నారు. భారీ బండరాళ్లతో నిర్మించిన రామదాసు చెరసాలను చూసిన విదేశీ పర్యాటకులు ఆనాటి నిర్మాణ శైలిని ఎంతో ఆసక్తి కరంగా చూస్తున్నారు.

హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న మౌలానా కారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ

గోల్కొండ: ఈ సంవత్సరం హజ్ యాత్రకు వెళ్తున్న వారి కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి లియాకత్‌హుస్సేన్ పర్యవేక్షణలో గురువారం జరిగిన ఈ ప్రార్థనలకు ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షులు మౌలానా కారీ సయ్యద్ మతీన్‌ఆలీషా ఖాద్రి నేతృత్వం వహించారు. గురువారం ప్రత్యేక విమానంలో బయలుదేరిన హజ్ యాత్రికులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

మతం పేరిట ఓట్లకు గాలం వేస్తున్న బీజేపీ


గౌరి సతీష్

అబిడ్స్: మతాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ ఓట్లను దండుకోవాలని చూస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం సెక్యులర్ పార్టీ అని ఆయన గుర్తు చేశారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... రాహుల్‌గాంధీ ప్రధాని అయితే ముస్లింలకు ఆస్తులు పంచుతారని ప్రధాని నరేంద్రమోదీ కొన్నిరోజుల క్రితం ప్రకటనలు చేయడం దారుణమన్నారు. మళ్లీ ఇప్పుడు ముస్లింల మీద ప్రేమ చూపిస్తూ మోదీ ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రధానమంత్రి నేరుగా మతాల గురించి మాట్లాడడం సరైంది కాదన్నారు.

సీఎం ప్రకటనపై ఉద్యోగుల హర్షం

నాంపల్లి: ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్‌లు కృతజ్ఞతలు తెలియచేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం నాంపల్లిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వంగా మారిందని అన్నారు. నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం గౌరవాధ్యక్షులు ఖాదర్ బిన్ హసన్, హైదరాబాదు జిల్లా అధ్యక్షులు వర్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం


గోల్కొండ: గోల్కొండ, మెహిదీపట్నం, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో దాదాపు గంటన్నర పాటు కురిసిన వర్షానికి రోడ్లు పూర్తిగా జలమయమైయ్యాయి. టోలిచౌకీ–టూమ్స్ రోడ్డుపై భారీగా వర్షం నీరు చేరడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. టోలిచౌకీ చౌరస్తా, నానల్‌నగర్ ఫ్లోర్ మిల్ తదితర ప్రాంతాల్లో సైతం రోడ్లపై రెండు అడుగుల మేర వర్షం నీరు నిలిచింది.

మైనర్ బాలిక ప్రసవం

– పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

చాంద్రాయణగుట్ట: మైనర్ బాలిక ప్రసవించిన ఘటనపై ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఫాతీమానగర్‌కు చెందిన 15 ఏళ్ల బాలిక గర్భం దాల్చి నిలోఫర్ ఆసుపత్రిలో చేరింది. ఈ నెల 3న ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ ఘటనపై బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 10న ఫలక్‌నుమా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా బాలిక గర్భం దాల్చడానికి గల వ్యక్తి ఎవరనే విషయాలు తెలియరాలేదు.

తగ్గిన నిమ్మ దిగుబడి.. పెరిగిన ధరలు



గౌలిపుర: వేసవికాలం నేపథ్యంలో నిమ్మకాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిన్న మొన్నటి వరకు రూ 2, 3 ఉన్న ధరలు ఏకంగా రూ.6–8 లకు పెరిగింది. దీంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. హోల్‌సెల్‌లో నిమ్మకాయ ధర రూ.4 ఉండగా రిటైల్‌లో రూ.6–8లకు విక్రయిస్తున్నారు. మార్కెట్‌కు నిమ్మకాయల దిగుమతి తక్కువగా ఉండటంతో ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

పాతబస్తీలో దంచికొట్టిన వర్షం

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు..
- ఇబ్బదులకు గురైన వాహనదారులు
- మూడు చోట్ల విరిగిన చెట్లు..
- విద్యుత్ సరఫరాలో అంతరాయం..
- వెంటనే స్పందించిన విద్యుత్ సిబ్బంది..
- మరమ్మతుల అనంతరం విద్యుత్ పునరుద్ధరణ


చార్మినార్ పరిధిలో కూలిన చెట్టు


తెగిన విద్యుత్ తీగలకు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

చార్మినార్: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం దంచికొట్టడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్ల లో వరద నీరు నిలిచిపోవడంతో అటువైపు నుంచి రాకపోకలు సాగించిన వాహనదారులు పడరాని పాట్లు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. మండే ఎండల నుంచి కొద్దిగా ఉపశమనం కలిగినప్పటికీ..అక్కడక్కడ లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. బలమైన ఈదురు గాలులకు మూడు చోట్ల చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి పడడంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఖిల్వత సబ్ స్టేసన్ పరిధిలోని చార్మినార్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని శివాలయం వద్ద భారీ చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే స్పందించిన టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ చార్మినార్ డీఈ లింగయ్య ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని తెగిపోయిన విద్యుత్ తీగలకు మరమ్మతుతలు చేయించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అలాగే షరీఫ్ నగర్ విద్యుత్ ఫీడర్ అత్తాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో, దేవీబాగ్ సబ్ స్టేషన్ పరిధిలో మరో రెండు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో వెంటనే మరమ్మత్తులు చేయించి విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు డీఈ లింగయ్య తెలిపారు. ఈ మూడు సంఘటనలలో ఎవరికీ గాయాలు కాలేదు. ఇక పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలోకి వరద నీరు చేరడంతో రోగులతో పాటు వారి సహాయకులు ఇబ్బందులకు గురయ్యారు.

భారీ వర్షానికి ప్రజల అవస్థలు



అబిడ్స్: ఎంజేమార్కెట్, జాంబాగ్, గోషాంహల్ ధూల్‌పేట్, ఉస్మాన్‌గంజ్ ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై నిలవడంతో ప్రజలు నరక యాతన చూశారు. ఈ ప్రాంతాల్లో దాదాపు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి ప్రజలు అవస్థలు పడ్డారు.

పురానాపూల్‌లో వరద ఉధృతి

జియాగూడ: గురువారం సాయంత్రం గంటన్నరపాటు కురిసిన భారీ వర్షానికి జియాగూడ, పురానాపూల్, గాంధి బొమ్మ ప్రాంతాల్లో వర్షం నీరు అడుగుకు పైగా రావడంతో ద్విచక్ర వాహనాలు నీట మునిగాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. జియాగూడ ఎత్తు ప్రాంతాల నుండి పురానాపూల్ వరకు, మంగళ్‌హాట్ ఎత్తు ప్రాంతాల నుండి గాంధీ బొమ్మ వరకు వర్షం నీరు పెద్ద ఎత్తున చేరింది.

జలమయమైన లోతట్టు ప్రాంతాలు.

యాకుత్‌పురా: గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి యాకుత్‌పురా నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గంగానగర్ నాలా, జఫర్‌రోడ్డు, బీబీబజార్ చౌరస్తా, యాకుత్‌పురా, రెయిన్‌బజార్, తలాబ్‌కట్టా, భవానీనగర్, దోబిఘట్, అక్రంనగర్, ముర్తుజానగర్, మదీనానగర్, నషేమన్ నగర్, యశ్రఫ్‌నగర్, చోటపూల్, యాకుత్‌పురా రైల్వే స్టేషన్ బ్రిడ్జి, మొఘల్‌పురా వల్హాహోటల్, హరిబౌలీ, లలితాబాగ్ సరస్వతినగర్ తదితర లోతట్టు ప్రాంతాల్లో వర్షాపు నీరు రోడ్డుపై నిలిచి పోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. తలాబ్‌కట్టా ప్రాంతాంల్లో వర్షపు నీరు రోడ్డుపై పెద్ద ఎత్తున్న ప్రవాహించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


బీబీ బజార్ చౌరస్తాలో


తలాబ్‌కట్టాలో ..


గాంధీబొమ్మ వద్ద వాహనాలు నీట మునిగిన దృశ్యం

మజ్లిస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి


షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ముక్కా కృష్ణాగుప్తా తదితరులు

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి మాధవీలతను దూషించిన మజ్లిస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చ ప్రధాన కార్యదర్శి ముక్కా కృష్ణాగుప్తా ఆధ్వర్యంలో పలువురు నాయకులు షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ బాలు చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముక్కా కృష్ణాగుప్తా మాట్లాడుతూ... పోలింగ్‌రోజు మజ్లిస్ నాయకుడు యాసర్ అరాఫత్ తన అనుచరులతో కలిసి బీజేపీ అభ్యర్థి మాధవీలతను దూషించినా ఇప్పటి వరకు పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. పాతబస్తీలో ఎన్నికల రోజు 144 సెక్షన్ కాని, గుంపు గుంపులుగా మాదవిలతపైకి వస్తూ ఆమెను దూషించారు.

హజ్ యాత్ర పవిత్రమైనది



గోల్కొండ: హజ్ యాత్ర ఎంతో పవిత్రమైందని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శుక్రవారం హజ్ యాత్రకు బయలుదేరి వెళ్తున్న గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ ఆర్గనైజేషన్ చైర్మన్ ఇలియాస్ అక్బర్‌ను గురువారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ సయ్యద్ ఫయాజ్ ఆయనకు శాలువా కప్పి పూలమాల వేసి హజ్ యాత్రకు క్షేమంగా వెళ్లి క్షేమంగా తిరిగి రావాలని అభినందించారు.

పేట్ల బురుజు ఆస్పత్రిని పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ

దూద్‌బౌలి: తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా,డీఎంఈ డాక్టర్ వాణిలతో కలిసి గురువారం సాయంత్రం పేట్లబురుజు ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నాలుగో అంతస్తులో నిర్మాణంలో ఉన్న ఐవీఎఫ్ రీసెర్చ్ సెంటర్ పనులను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌తో పాటు ప్రసూతి వార్డులకు వెళ్లి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులను పలకరించి వారికి అందుతున్న వైద్యం గురించి ఆరా తీసారు. వీరి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీ రెడ్డి, ఆర్‌ఎంఓలు డాక్టర్ అనంత లక్ష్మీ, డాక్టర్ సీపీ జైన్ తదితరులు ఉన్నారు.

అమ్మకానికి సీజనల్ పండ్లు


పనసపండ్లు

గోల్కొండ: మార్కెట్‌లో సీజనల్ పండ్లు జోరుగా అమ్ముడవుతున్నాయి. మామిడి పళ్లతో పాటు పనస పండు(జాక్ ఫ్రూట్), తాటి ముంజలు అమ్మకానికి వస్తున్నాయి. అయితే కొన్ని రోజులు మాత్రమే మార్కెట్‌లో లభ్యమైయ్యే పనస పండుకు మాత్రం బాగా క్రేజ్ ఉంది. గుడిమల్కాపూర్, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో పనస పండు బాగా అమ్ముడవుతున్నాయి. పలు సూపర్‌మార్కెట్‌లలో సైతం పనస పండు లభిస్తుంది. భారీ సైజులో వచ్చే పనస పండును కోసి కిలో చొప్పున అమ్ముతున్నారు. పండును కోయకుండా రూ.50–60 కిలో అమ్ముతున్నారు. లోపలి గుజ్జు, గింజ రూ.80–100 కిలో అమ్ముతున్నారు. మరోవైపు వివిధ రకాల మామిడి పండ్లు సైతం బాగా అమ్ముడవుతున్నాయి. బేనిషాన్ మామిడి పండు కిలో 60–70 రూపాయలకు అమ్ముతుండగా చిన్న రసాల్, పెద్ద రసాల్ పండ్లు కూడా మార్కెట్‌లో లభిస్తున్నాయి. మరోవైపు తాటి ముంజలు సైతం మార్కెట్‌లో లభిస్తున్నాయి. డజన్ పండ్లు 120–150 వరకు లభిస్తున్నాయి.


లిచి పళ్లు

నోరూరించే లిచి...

కేవలం నెల రోజుల పాటు లభించే లిచి పండు కూడా మార్కెట్‌లో లభిస్తోంది. నోరూరించే ఈ పండు కిలో 350–400 రూపాయలకు అమ్ముడవుతుంది. ఈ పండు హాట్‌హాట్ కేక్‌గా అమ్ముడవుతోంది.

ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు పర్మనెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వాలి


టీఎంసీ చైర్మన్ డాక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న వైద్య విద్యార్థులు

సుల్తాన్‌బజార్: విదేశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసి ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన వైద్య విద్యార్థులకు పర్మనెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వాలని పలువురు వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వద్ద వైద్య విద్యార్థులు ఆందోళనకు దిగారు. తమ డిమాండ్లపై టీఎంసీ చైర్మన్ డాక్టర్ మహేష్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు ఖలీల్, మణికుమార్, రశ్మితలు మాట్లాడుతూ...... 2021లో విదేశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఒక సంవత్సరం పాటు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన తమకు పర్మనెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వాలని గత ఏడు నెలలుగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, ఇప్పుడు ఏడాది పాటు మరో ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేయాలని ఎంఎంసీ నిబంధనలకు విరుద్ధమని వైద్య విద్యార్థులు మండిపడ్డారు. కౌన్సిల్ అధికారుల నిర్లక్ష్యంతో తమ భవిష్యత్తు నష్టపోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఢిల్లీ, యూపీ, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో ఉపకార వేతనంతో పాటు ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేసిన విదేశీ విద్యార్థులకు పర్మనెంట్ రిజిస్ట్రేషన్ అందజేశారని వారు తెలిపారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన తమకు పర్మనెంట్ రిజిస్ట్రేషన్ కల్పించి న్యాయం చేయాలని కోరారు. తమకు న్యాయం జరగకపోతే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా తెలంగాణ మెడికల్ కౌన్సిపల్ చైర్మన్ డాక్టర్ మహేష్ కుమార్ ఈ అంశాన్ని కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన మీడియాకు వివరణ ఇచ్చారు.

ఘనంగా నల్లపోచమ్మ అమ్మవారి ఊరేగింపు


పురవీధుల్లో నల్లపోచమ్మ మాతేశ్వరీ ఊరేగింపు దృశ్యం

జియాగూడ: సంజయ్‌నగర్ నల్లపోచమ్మ, తుల్జాభవాని దేవాలయ వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజున నల్లపోచమ్మ మాతేశ్వరీ ఊరేగింపు కన్నుల వైభవంగా కొనసాగింది. సోమవారం నుండి మాతేశ్వరీ మహోత్సవాలు మూడు రోజుల పాటు ప్రతి రోజు వివిధ దేవతా మూర్తుల పూజలు, యజ్ఞ మహోత్సవాలు, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. బుధవారం రాత్రి నల్లపోచమ్మ మాతేశ్వరీ ఊరేంపు ఆలయం నుండి బయల్దేరి డబుల్‌బెడ్‌రూమ్, 2జే బస్టాప్ కుల్సుంపురా, భగత్‌సింగ్ చౌరస్తా, జియాగూడ ప్రధాన రహదారి గుండా ఆలయానికి చేరుకున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి రావుల శ్రీనివాస్ తెలిపారు. గురువారం రోజు అన్నదాన కార్యకమంతో వేడుకలు ముగిశాయి.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం



చాంద్రాయణగుట్ట: బీజేపీతోనే పాతబస్తీ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ చాంద్రాయణగుట్ట నేత కౌడీ మహేందర్ అన్నారు. జంగమ్మెట్ డివిజన్‌లోని ఓంనగర్‌లో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని బస్తీలలో డ్రైనేజీ ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యం ప్రజల నడుమ ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం అవసరమైన మేరకు అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రచయిత మద్దాలి రఘురామ్ రచించిన తెలుగు ప్రముఖుల అభిమానిగా పుస్తకావిష్కరణ సభ గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కారాన్ని అందుకున్న మద్దాలి ఉషా గాయత్రిని ఘనంగా సన్మానించారు. అంతకు ముందు గాయని గాయకుల సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పూర్వ ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి, తెలుగు విశ్వ విద్యాలయ పూర్వ ఉపకులపతా ఆచార్య ఎన్.గోపి పాల్గొన్నారు.

18న తెలంగాణ రాష్ట్ర సాధకుల డాక్యుమెంటరీ ప్రారంభం


మాట్లాడుతున్న ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ : తెలంగాణ ఉద్యమకారుల చరిత్రను తెలియజేయడానికి ఈ నెల 18 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధకుల డాక్యుమెంటరీని ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఛైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు అయిన సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సాధన ఉత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్ రెడ్డి, కన్వీనర్లు వెంకటేష్ గౌడ్, జ్యోతిరెడ్డి, ఉపాధ్యక్షులు కె.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

హత్యాకాండపై సుప్రీం సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి

సుల్తాన్‌బజార్: ఛతీస్‌ఘడ్‌లో ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ ఈ నెల 18న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.నారాయణరావు తెలిపారు. ఆ సభకు సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ గురువారం హైదర్‌గూడలోని ఎస్‌ఎస్‌ఎస్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పీడిత ప్రజలకు చెందిన సహజ సంపదను కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చేందుకు ఆదివాసులను హతం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు.

ఎన్నాళ్లీ ట్రాఫిక్ తిప్పలు

- వాహనదారులకు నరకం చూపిస్తున్న ట్రాఫిక్ జాం
- నడిరోడ్డుపై వ్యాపారాలు... ముందుకు సాగని వాహనాలు
- ట్రాఫిక్ దిగ్బంధంలో వాహనదారులు... కనిపించని ఫుట్‌పాత్‌లు


ట్రాఫిక్ దిగ్బంధంలో వాహనాలు

చార్మినార్: ఉత్తర మూసి ప్రాంతమైన అఫ్జల్‌గంజ్ నుంచి మూసి నది దాటి నయాపూల్‌కు అడుగు పెడితే చాలు..వాహనదారులు నరకాన్ని చవి చూడాల్సి వస్తోంది. మూసి నదికి అవతల వైపు నుంచి ఇవతల వైపున ఉన్న పాతబస్తీలో ఎప్పుడు చూసినా వాహనాలు ముందుకు వెళ్లని పరిస్థితులుంటాయి. నయాపూల్ నుంచి మదీనా సర్కిల్, హైకోర్టు రోడ్డు ద్వారా బెంగుళూర్ జాతీయ రహదారి సైతం ఇక్కడి నుంచి వెళుతుండడంతో ఈ రోడ్డుపై అన్ని రకాల వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పాతబస్తీలోని అన్ని ప్రధాన రోడ్లలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నయాపూల్ నుంచి గుల్జార్‌హౌజ్ వరకు, దారుషిఫా చౌరస్తా నుంచి మీరాలంమండి,ఎతేబార్ చౌక్, కోట్ల అలీజా ద్వారా బీబీబజార్ చౌరస్తా వరకు, మదీనా నుంచి పురానాపూల్ చౌరస్తా, కిషన్‌బాగ్, లాల్‌దర్వాజ మోడ్ నుంచి చత్రినాక,పూల్‌బాగ్ తదితర రోడ్లలో ట్రాఫిక్ జాం కనిపిస్తుంది.

చిరువ్యాపారాలన్నీ నడిరోడ్డు పైనే..

మదీనా–చార్మినార్ ప్రధాన రోడ్డులో ఫుట్‌పాత్‌లే కాదు.... రోడ్లు సైతం చిరు వ్యాపారస్తులు ఆక్రమించుకొని నడిరోడ్డుపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రెగ్యులర్‌గా వ్యాపారాలు చేసే వారిని గుర్తించి వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేసి ఒక ప్లేస్‌ను కేటాయించి క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంది. పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామాగ్రి... ఒక్కటేమిటి పాతబస్తీలో సర్వమూ రహదారిపైనే అమ్మకానికి ఉంటాయి. వాహనాల పార్కింగ్ కూడా నడిరోడ్డు పైనే!.. ఇక ట్రాఫిక్ సిబ్బంది తక్కువేమి కాదు... రాకపోకల్ని గాడిలో పెట్టే పని మాని...నయానో భయానో నిబంధనల సాకు చూపి తవు టార్గెట్ పూర్తి చేసుకుంటున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు ఎన్నికల తనిఖీలలో పూర్తిగా నిమగ్నమయ్యారు. పర్యాటక పరంగా, వ్యాపార పరంగా, నివాసపరంగా పాత నగరానికి జనం తాకిడి ఎక్కువగా ఉంటుంది.

చార్మినార్ ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్డులో...

నడిరోడ్లను ఆక్రమించి కొనసాగే చిరు వ్యాపారాలతో ప్రతి నిత్యం ట్రాఫిక్ జాంలు తప్పడం లేదు. చార్మినార్ ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్లతో పాటు పరిసర ప్రాంతాల రోడ్లలో ప్రతి రోజు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రధాన కూడళ్లలో అక్కడక్కడా ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చినప్పటికీ....ఇంకా ట్రాఫిక్ సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ట్రాఫిక్ పోలీసులు అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ... చిరు వ్యాపారులు, వాహనదారులు వారికి సహకరించడం లేదు. రయ్యిమంటూ ఎవరు ఎటువైపు నుంచైనా ముందుకు వెళుతుంటారు. కొంత మంది వాహనదారులు త్వరగా తమ గమ్యానికి వెళ్లాలనే తొందరలో ట్రాఫిక్ జాంలతో పాటు ప్రమాదాలకు కారణమవుతున్నారు. వాహనదారులు నిబంధనలు పాటించడం లేదు. ట్రాఫిక్ సిబ్బంది వారించబోయినా వాగ్వాదానికి దిగుతున్నారు.